క్లుప్తంగా

రేపు మల్లమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో మల్లమ్మ దేవత

వీరబల్లి: మండలంలోని ఓదివీడు కస్బాలో వెలసిన మల్లమ్మ జాతర గురువారం రాత్రి నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక సభ్యులు తెలిపారు. ఇటీవల అతి పురాతనమైన మల్లమ్మ ఆలయానికి మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా జాతర నిర్వహించాలని గ్రామంలోని పెద్దలు నిర్ణయించారు. అలాగే శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకోనున్నారు.

ఘనంగా నాగరాపమ్మ జాతర

సంబేపల్లె : మండల పరిధిలోని గున్నికుంట్ల గ్రామంలో వెలసిన నాగరాపమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో అలంకరించారు. సందర్భంగా మొక్కులు తీరిన భక్తులు సోమవారం రాత్రి చాందినీ బండ్లు కటి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

మారెమ్మ తల్లి ఆలయానికి వితరణ



ఆలయ నిర్వాహకులకు నగదు అందజేస్తున్న గుణయాదవ్

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో వెలసిన మారెమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి పునగాని సుబ్బనరసయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు పునగాని అంజన్‌కుమార్ యాదవ్, గుణయాదవ్‌లు రూ.11,111లను ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దుర్గారెడ్డి, అరిగే హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

8న బండలాగుడు పోటీలు

సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీ అంకాలమ్మ తిరునాల సందర్భంగా ఈనెల 8వ తేదీన వృషభాలతో బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు మంగళవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలిచిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ. 50వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ. 20వేలు, నాల్గవ బహుమతి రూ. 10వేలు అందజేస్తామని తెలిపారు.


'గాలేరు-నగరి' పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకుడు రాహుల్

చిట్వేలి: ఉమ్మడి కడప జిల్లాలో గాలేరు, నగిరి ప్రాజెక్టును పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ కోరారు. మంగళవారం ఆయన చిట్వేలిలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో పోలవరం తరువాత గాలేరు నగిరికి రెండోస్థానం కేటాయించినప్పటికీ పనులు నత్తనడక నడుస్తున్నాయన్నారు. మద్దిమడుగు నుంచి సిద్దవటం మండలం బాకరాపేట దగ్గర ఉన్న మద్దిమడుగు ప్రాజెక్టు వరకు గాలేరు నగిరిని పొడిగించి.. అక్కడ నుంచి గ్రావిటీ ద్వారా రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఉన్న చెరువులను నింపి సాగు, తాగునీరు అందించాలని రాహుల్ కోరారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు విశ్వనాథ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన



చైతన్యకుమార్ చేత కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

రాజంపేట రూరల్: పట్టణ శివార్లలోని నారపరెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాజంపేట మున్సిపాలిటీ జనరల్ సెక్రటరీ సోంబెత్తిన శ్రీనివాసులు మనవడు సోంబెత్తిన చైతన్య కుమార్ పుట్టిన రోజు వేడుకలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి పాల్గొని చైతన్య కుమార్‌ను ఆశీర్వదించారు. ఈ వేడుకలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, వివిధ విభాగాల కన్వీనర్లు మలిశెట్టి శ్రీనివాసులగౌడ్, గంగా కల్యాణ్‌కుమార్‌రెడ్డి, బొజ్జా పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్

- మళ్లీ మొదలైన కష్టాలు
- పలు చోట్ల సర్వర్ల మొరాయింపు
- షాపుల వద్ద పడిగాపులు
- కూటమి సర్కారు చర్యలపై నిప్పులు



రేషన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

రాయచోటి టౌన్ : పేదవానికి రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. గత వైఎస్‌ఆర్‌సీపీ సర్కారు ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే రేషన్ విధానాన్ని.. కూటమి ప్రభుత్వం రద్దు చేసి పాత విధానాన్ని తీసుకువచ్చింది. చౌకదుకాణాల వద్ద రేషన్ పంపిణీకి జూన్ 1వ తేదీ నుంచి శ్రీకారం చుట్టింది.మూడు రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా కార్డుదారులు రేషన్ కోసం అవస్థలు పడ్డారు. రాయచోటి పట్టణంలో మంగళవారం రేషన్ కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎండ వేడిమి అధికంగా ఉండటంతో ఉదయం 8 గంటలకు ముందే.. చౌక దుకాణాల వద్దకు చేరుకున్నారు. వేళ్లు ముదిరి, కీళ్లు కదిలిన వృద్ధులు, చంకన చంటిబిడ్డలతో తల్లులు, చిన్నాచితకా పనులు పోగొట్టుకుని వచ్చిన కూలీలు, చిరు వ్యాపారాలతో పొట్ట పోసుకునే పేదలు.. ప్రభుత్వ చౌక దుకాణాల వద్ద క్యూలు కట్టారు. ఎంత త్వరగా తమవంతు వస్తే బియ్యం తీసుకుని వెళ్లిపోదామని ఆత్రుతగా ఎదురు చూశారు. కానీ పలుచోట్ల సర్వర్ సమస్య ఉత్పన్నమైంది. దీంతో గంటల తరబడి కార్డుదారులు తమ వంతు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది.

వేలిముద్రలు పడక అవస్థలు

చాలా ఎఫ్‌సీ షాపుల్లో కార్డుదారులు వేలిముద్రలు పడక ఇబ్బందులు పడ్డారు. అలాంటి వారు చేసేదేమీ లేక ఇంటి ముఖం పట్టారు. కొన్ని చోట్ల డీలర్లు దయదలిచి ఒట్టి చేతులతో వెళ్లకుండా.. బియ్యం ఇచ్చి పంపడం కనిపించింది. ఆ తర్వాత మరోసారి వారిని పిలిపించుకుని అథెంటికేషన్ వంటివి తీసుకోవచ్చని అలా చేశారు. చాలా మందికి ఎఫ్‌సీ షాపు డీలర్లు రశీదులు ఇవ్వలేదు. దివ్యాంగులు, 65 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందజేస్తామని ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం.. ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. బియ్యం, చక్కెరతోపాటు జొన్నలు కూడా పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఐదు కిలోల జొన్నలు తీసుకుంటే.. ఆ మేరకు బియ్యంతో కోత విధిస్తామని తెలిపారు. అయితే పలుచోట్ల కార్డుదారులు తమకు జొన్నలు ఇవ్వాలని కోరగా, అందుబాటులో లేవంటూ డీలర్లు చెప్పడంతో నిరాశ చెందాల్సి వచ్చింది. ప్రభుత్వం తగినంత మేర జొన్నలు సరఫరా చేయకపోవడం ఇందుకు కారణం.

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో..

ప్రభుత్వ చౌకదుకాణం వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను గమనించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇంటింటికి రేషన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ వాహనాలను) సమకూర్చి సరుకులను ప్రజలకు అందిస్తూ వచ్చారు. బియ్యం బండి ఫలాన గ్రామం, వీధికి ఎప్పుడు వస్తుందో ముందుగానే వలంటీర్లు సమాచారం అందించేవారు. దీంతో రేషన్ కార్డుదారులు బియ్యం బండి వచ్చే సమయానికి అందుబాటులో ఉండి.. సరుకులు ఇంటి ముంగిటే తీసుకునేవారు. అందువల్ల ఎవరూ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది కాదు. ఈ విధానం ఇతర రాష్ట్రాల ప్రశంసలు సైతం అందుకుంది. ప్రజలు కూడా ఈ విధానానికి కొన్నేళ్లుగా అలవాటు పడ్డారు. ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి పనులను చెరిపి వేయాలన్న ఉద్దేశంతో.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. మళ్లీ ప్రభుత్వ చౌక దుకాణాల నుంచి రేషన్ పొందాల్సి రావడంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి.

వారి విలువ తెలియలేదు



గతంలో ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇచ్చేవారు. అప్పుడు వారి తెలియలేదు. అందుకే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు అయింది. దివ్యాంగులకు ఇంటి వద్దకే వచ్చి అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇక్కడ ఉన్న జనాభాను వదలిపెట్టి మాకు ఇంటికి అందించే అవకాశం లేదు.

– నాగసుబ్బమ్మ, దివ్యాంగురాలు, రాయచోటి

బియ్యం ఎలా మోసుకెళ్లాలి



గతంలో అయితే మా ఇంటికే వచ్చి రేషన్ ఇచ్చేవాళ్లు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రేషన్ ఇచ్చే షాపు ఎక్కడుందో తెలుసుకొనేందుకు నిన్నటి నుంచి వెతుక్కొంటూ ఈ రోజు తెలుసుకొన్నాను. ఈ ముసలి వయస్సులో బియ్యం ఎలా మోసుకెళ్లాలి. వాళ్లకేమి తెలుస్తుంది

– బలరామ, కొత్తపేట, రాయచోటి

ఒక రోజు మాత్రమే సెలవు ఇస్తారు



నేను ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్నాను. నాకు ఒక రోజు అయితే సెలవు ఇస్తారు. ఇప్పుడున్న జనాలను చూస్తే ఈ రోజు కూడా రేషన్ ఇచ్చేలా లేరు. గతంలో అయితే నేను లేకపోయినా మా భార్య ఇంటి దగ్గరే ఉంటూ పిల్లలను చూసుకొంటూ అక్కడే రేషన్ తీసుకొనేది. ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు మాకు.

– రాజు, రాయచోటి

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి



నందలూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగయ్య



ఓబులవారిపల్లె: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రెడ్డయ్య

నందలూరు : విద్యార్థులకు రుచికరమైన భోజనం్ని అందించాలని ఎంఈఓ-1 నాగయ్య పేర్కొన్నారు. మండలంలో మధ్యాహ్న భోజనం వంట చేసే వారికి (కుక్ కం హెల్పర్స్) మంగళవారం నాగిరెడ్డిపల్లె హైస్కూల్ నందు ట్రైనింగ్, కుకింగ్ కాంపిటీషన్స్ ఎంఈఓ-2 సీఆర్ అనంతకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం పథకంలో పోషక విలువలు, పిల్లల రుచికి తగినట్లుగా అనేక రకాల ఆహార పదార్థాలు మెనూలో చేర్చారని, ప్రతిరోజు మెనూ ప్రకారం వంటలు చేయాలని సూచించారు. ఎంఈఓ-2 సీఆర్ అనంతకృష్ణ మాట్లాడుతూ వంట గది పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు ముజఫర్ అహమ్మద్, అమరావతి, వెంకటనరసమ్మ, రేవతి, సాంబశివ, మాలతి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

ఓబులవారిపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ రెడ్డయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంట పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చెంగయ్య, వంట ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన 'కూటమి'



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసిన అజయ్ రెడ్డి

పెనగలూరు: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటు అబ్జర్వర్ కొండూరు అజయ్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అజయ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే పలు సమస్యలపై వారు చర్చించారు. బుధవారం జరగనున్న వెన్నుపోటు దినోత్సవంపై కూడా చర్చించారు. కోడూరుతోపాటు కడప పార్లమెంటు పరిధిలో వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు.

పరామర్శ



గిరిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : మండలం అరవీడు గ్రామం బండకింద పల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బుక్కపటన్ం గిరి కాలికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం అరవీడు వెళ్లి గిరిని స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

గాలివీడు మండలం అరవీడు గ్రామం బండకింద పల్లెకు చెందిన మడితం నాగేశ్వర కుమారుడి వివాహ వేడుకలకు హాజరైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం



మస్తాన్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్య పడవద్దని, అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. మంగళవారం మంగంపేట గ్రామంలో ఆయన పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రసూల్ కుమారుడి మస్తాన్ పరామర్శించి ఆరోగ్యంపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ పార్టీ కార్యకర్త ఓబయ్య కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు కె. భరత్ కుమార్ రెడ్డి, రైల్వేకోడూరు పట్టణ అధ్యక్షులు సీహెచ్ రమేష్, డి. సిద్దయ్య, గల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



టీబీ రోగులకు ఆహారం అందిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శేఖర్, రమేష్‌నాయుడు

రాజంపేట టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ సహకారంతో టీబీ రోగులకు పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు రమేష్‌నాయుడు మాట్లాడుతూ టీబీ లేని సమాజం కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. అందులో భాగంగా తమ పార్టీ నాయకులు టీబీ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ టీబీకి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మంచి మందులు ఉన్నాయన్నారు. తొలి దశలోనే గుర్తించి కోర్సును ప్రారంభిస్తే ఆరు నెలల్లో టీబీ పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. టీబీ సూపర్‌వైజర్ పిల్లి. జయప్రకాశ్, హిమగిరియాదవ్, పెనుగొండ రమణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో సూచిక బోర్డు ఏర్పాటు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని రాయచోటి-వేంపల్లి మార్గమధ్యంలోని బైబిల్ ఫ్యాక్టరీ సమీపంలోని హైవే రోడ్డుకు ఆనుకుని ఉన్న సర్వే నంబరు 705/2లో కలెక్టర్ ఉత్తర్వులు మేరకే సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. గతంలో సూర్యనారాయణ రెడ్డి పేరుతో డీకేటీ పట్టా అప్పటి ప్రభుత్వం ఇవ్వడంతో అతను సతీమణి సాయిలీల పేరుతో ఆన్‌లైన్‌లో రెండు ఎకరాలు నమోదై ఉన్నట్లు తెలిపారు. ఈ భూమికి సంబంధించి సూర్యనారాయణ రెడ్డి కుమార్తె కోర్టును ఆశ్రయించడంతో పాటు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము కలెక్టర్ ఆదేశాల మేరకే సూచిక బోర్డులను ప్రభుత్వ భూమిగా కనపరుస్తూ ఏర్పాటు చేశామని తహసీల్దార్ పేర్కొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించాలి

రాయచోటి టౌన్ : బక్రీద్ పండుగను శాంతియువ వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి కోరారు. మంగళవారం రాత్రి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మత పెద్దలతో కలసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పండుగ సమయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలని వారికి సూచించారు. సంతోషంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని వారిని కోరారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం

- 'వెన్నుపోటు దినం' జయప్రదం చేద్దాం
- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపై మంగళవారం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఉదయం 9 గంటలకు రైల్వేకోడూరుకు చేరుకోవాలన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి ర్యాలీగా బయలుదేరి.. టోల్ గేటు వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి.. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

అన్ని వర్గాలను మోసం చేస్తున్న బాబు

గాలివీడు: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న వెన్ను పోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర మాజీ డీటీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఆవుల నాగభూషణరెడ్డి, పార్టీ కన్వీనర్ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్ వలి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న ఎన్నికల సమంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. హామీలను గాలికి వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకే ప్రాధాన్యమిస్తున్నారని దుయ్యబట్టారు.

సంబేపల్లె : అన్నమయ్యజిల్లా కేంద్రంలో రాయచోటిలో బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ పిలుపు నిచ్చారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

రాయచోటి టౌన్ : యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ముఖ ద్వారం ఎదురుగా 11వ అంతర్జాతీయ యోగా మాసోత్సవాల్లో భాగంగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవన శైలితో ప్రస్తుతం ప్రజలు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా వీటిని దూరం చేయొచ్చని పేర్కొన్నారు. అనంతరం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ యోగా తరగతులలో అందరూ పాల్గొని వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. యోగా మాస్టర్ లయన్ సుదర్శన్, వాసవి ధ్యాన కేంద్ర వ్యవస్థాకులు కూన కృష్ణదేవరాయులు, శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేస్తున్న అధికారులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

చిన్నమండెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు రవిచంద్రబాబు, చంద్రానాయక్ సూచించారు. మంగళవారం చిన్నమండెం మండలం చిన్నమండెం, బోరెడ్డిగారిపల్లె గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వారు మామిడిలో మేలైన దిగుబడులకు చేయాల్సిన కొమ్మ కత్తిరింపులు, తేనె మంచు పురుగు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి మండలంలో మూడు గ్రామాలు ఎన్నుకొని రైతులకు ఖరీఫ్ రాక ముందే పంటలు, రకాలు మేలైన యాజమాన్య పద్ధతులు శాస్త్రవేత్తలు అందజేస్తారని తెలిపారు. జిల్లాలో 30 మండలాలకు గాను 34 డ్రోన్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత నూనె గింజల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డా.బసవరాజ్, వైఎస్ఆర్‌హెచ్‌యూ ఉద్యాన కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ముకుందలక్ష్మి, ఉద్యానవన అధికారిణి వనితాబాయి, ప్రకృతి వ్యవసాయ అధికారి చందురెడ్డి, వ్యవసాయాధికారి గీత, కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

సిద్దవటం: ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా వ్యాధి నిరోదక టీకాలు వేయించాలని ఆశా వర్కర్‌లకు, ఏఎన్ఎంలకు మాధవరం పీహెచ్‌సీ వైద్యధికారి డాక్టర్ శివకుమార్ సూచించారు. సిద్దవటం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, జాగ్రతగా ఉండాలని, కరోనా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ శ్రీవిద్య, ఎంపీహెచ్ఈఓ నాగపల్లి, ఎంపీహెచ్ఎస్ రమణయ్య, జ్యోతిక, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ఆశావర్కర్లు

పేదల గుండె చప్పుడు పాలకొండ్రాయుడు

రాయచోటి టౌన్ : రాయచోటి పేద ప్రజల గుండెచప్పుడు మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు అని టీటీడీ మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. మంగళవారం రాత్రి రాయచోటి పట్టణంలోని కొత్తపేటలోని సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొండ్రాయుడు బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. అంతకు ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెరికల రెడ్డెన్న, గొనిపల్లె శ్రీనివాసులు, తుమ్మగింజల వెంకటరమణ, కౌన్సిలర్ భాస్కర్, మాజీ కౌన్సిలర్ రామ్మోహన్ పాల్గొన్నారు.



మాజీ ఎంపీ పాలకొండ్రాయుడుకు నివాళి అర్పిస్తున్న సుగవాసి ప్రసాద్ బాబు తదితరులు

కరెంట్ కష్టాలు తీరేదెన్నడో?

- చెట్ల మధ్యలో 11 కేవీ వైర్లు
- బెస్తపల్లి సబ్ స్టేషన్‌లో పడిపోతున్న ఫీజులు
- ఇబ్బందుల్లో రైతులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కంపచెట్ల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పెనగలూరు: మండలంలో వినియోగదారులను కరెంట్ కష్టాలు వేధిస్తున్నాయి. ఒక పక్క ఎండ వేడి, మరో పక్క ఉక్కపోతతో జనం అల్లాడుతుంటే పగలూ రాత్రీ తేడా లేకుండా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. మండలంలోని బెస్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ వైర్లుకు కంప చెట్లు అల్లుకొని ఉండటంతో స్టేషన్‌లో ఫీజులు పడిపోతూ ట్రిప్ అవుతుంది. దీంతో రైతులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ సబ్ స్టేషన్‌లో ట్రిప్ అవుతుంది, మండలంలో విద్యుత్ ఏఈ బదిలీ కావడంతో అప్పటి నుంచి నూతన ఏఈని నియమించకపోవడం గమనార్హం. దీంతో విద్యుత్ వైర్లపై కంపచెట్లు, ఇతర చెట్లు పడి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలు ఇబ్బందులు పడుతున్నాయి. వెంటనే ఏఈని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

నల్లపురెడ్డిపల్లి లైన్‌మెన్ పోస్టు ఖాళీ

నల్లపురెడ్డిపల్లి లైన్‌మెన్ పోస్టు ఖాళీ పడటంతో ఇక్కడ కంపచెట్లు వేపుగా పెరిగి లైన్లపై పడటంతో ఇటు సబ్ స్టేషన్‌లోనూ అటు ట్రాన్స్‌ఫార్మర్‌లోనూ ఫీజులు ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే లైన్‌మెన్‌ను నియమించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. అలాగే బెస్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా గ్రామాలు ఉండడంతో అధిక లోడ్ వల్ల తరచూ ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను బైబర్గేషన్ చేసి విద్యుత్ సరఫరాను అందించాలని ప్రజలు కోరుతున్నారు. సిబ్బందిని నియమించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో రైతులు పంటలకు నీళ్లు అందించలేక అవస్థలు పడుతున్నారు. పైర్లు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. సిబ్బందిని నియమించి విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.